సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



తాగునీటి కోసం ఆందోళన

తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ భీంపూర్ బొజ్జుగూడ వాసులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 8లో▸



గాలొస్తే కరెంట్ కట్ 9లో▸

చినుకు పడినా, గాలి వీచినా గ్రామాల్లో అంధకారం నెలకొంటుంది. విద్యుత్ మరమ్మతులకు గంటల కొద్దీ సమయం పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.6/27.6

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కల్లు బట్టీలు, బెల్ట్‌షాపులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఇజ్జగిరి నారాయణ

ఎదులాపురం: జిల్లాలోని ఏజెన్సీ, పట్టణ, మైదాన ప్రాంతాల్లో అక్రమంగా నడుపుతున్న కల్లు బట్టీలు, బెల్ట్‌షాపులను అరికట్టాలని తెలంగాణ ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు మూలాలైన యువత మత్తు పానీయాలకు బానిసలవుతున్నారని, సరైన అవగాహన లేక అక్రమ మద్యం, గంజాయి, కల్తీ కల్లు బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్ర ప్రభావం చూపుతున్న ప్రస్తుత తరుణంలో మత్తుకు బానిసలుగా మారుతున్న యువతను సన్మార్గంలో నడిపించడానికి, చైతన్య పరచడానికి తగిన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యానికి శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సంతోశ్, టార్పే తులసి, జిల్లా ప్రధాన కార్యదర్శి కినక సురేష్, జిల్లా కార్యదర్శి కరుణ, జిల్లా సహాయ కార్యదర్శి గెడం రాము, జిల్లా అధికార ప్రతినిధి నీరటి ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

22లోగా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లమాలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్–2024కు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త పి.భరద్వాజ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పూర్తయిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, మే 17న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాలను సమూలాంగా నిర్మూలించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. స్థానిక పోలీసు కార్యాలయంలో సోమవారం మత్తు పదార్థాలు, కల్తీ కల్లు, గంజాయి, నిర్మూలనకు తోడ్పడేలా ముద్రించిన పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్ రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కే సత్యనారాయణ, ఏ.అశోక్, డి.సాయినాథ్, కె.పనిధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నేరడిగొండ: వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జీసీడీఓ మెస్రం ఛాయ అన్నారు. సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా లఖంపూర్ గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, తరగతి గదిలో చీకటి లేకుండా లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

వడ్డీ వ్యాపారుల ఆగడాలు



సంతోష్ జైస్వాల్ ఇంట్లో డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఎస్సై సునీల్

- మితిమీరాయన్న ఆరోపణలు
- అవసరానికి రుణాలు తీసుకునేవారి నుంచి అధిక మొత్తంలో మిత్తి వసూలు
- డబ్బులు చెల్లించని వారి నుంచి ఇల్లు, పొలాలు బలవంతంగా హస్తగతం
- ఆదిలాబాద్‌లోనూ విచ్చలవిడిగా దందా కొనసాగుతుందని విమర్శలు
- రూ.లక్షల నుంచి కోట్ల రూపాయలు అప్పులిస్తున్న వైనం
- ఫిర్యాదుల నేపథ్యంలో ఇతర జిల్లాల్లో పోలీసుల సోదాలు
- ఇక్కడ కూడా దృష్టి సారించాలని జనాల అభిప్రాయం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇదే ప్రాంతానికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి నుంచి నాలుగేళ్ల క్రితం కోటి రూపాయలకు పైగా అప్పు తీసుకున్నాడు. ఆ సమయంలో ఇంతకు రెండు, మూడింతల విలువైన ఆస్తికి సంబంధించిన తన పత్రాలను ఆ వడ్డీ వ్యాపారి దగ్గర ఉంచి రుణం తీసుకున్నాడు. ఆ తర్వాత కాలంలో రుణం తీసుకున్న వ్యక్తి డబ్బులు చెల్లించలేకపోయాడు. ఏడాది కిందట ఆ విలువైన ఆస్తిని ఆ వడ్డీ వ్యాపారి తన పేరిట బదిలీ చేసుకుని బలవంతంగా హస్తగతం చేసుకున్నాడు.

విచ్చలవిడిగా దందా..

పైన పేర్కొన్నది చెప్పుకోవడానికి ఒక సంఘటన అయినప్పటికీ, జిల్లాలో ఇలాంటివి రోజు అనేకంగా జరుగుతున్నవే. అవసరానికి రుణాలు తీసుకునే వారి నుంచి వడ్డీ వ్యాపారులు అధిక మొత్తంలో ఇంట్రెస్ట్ వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. లక్షల రూపాయల నుంచి కోట్ల రూపాయల వరకు అప్పులు ఇస్తున్న వడ్డీ వ్యాపారులు అంతకు మించి విలువైన ఇండ్లు, పొలాలకు సంబంధించిన పత్రాలను తమ దగ్గర ఉంచుకుని జనాలకు రుణాలు ఇస్తున్నారనే ప్రచారం ఉంది. ప్రాపర్టీ సేల్ డీడ్, ప్రామిసరీ నోట్, బ్లాంక్ చెక్‌ల ద్వారా రుణం ఇచ్చే సమయంలోనే వడ్డీ వ్యాపారి తనకు అనువైన రీతిలో మలుచుకోవడం ద్వారా రుణగ్రహీత అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారని విమర్శలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆ తర్వాత ఆ వ్యక్తి డబ్బులు కట్టకపోతే ఆస్తులు బదలాయించుకోవడం వంటివి చేస్తున్నారనే అపవాదు ఉంది.

పోలీసులు దృష్టి సారించాలి

వడ్డీ వ్యాపారం ముసుగులో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో పోలీసులు ఇలాంటి వ్యాపారస్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. సేల్ డీడ్‌లు, ప్రామిసరీ నోట్ల వంటివి స్వాధీనం చేసుకుంటున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఈ సోదాలు కొనసాగుతున్నాయి. కాగా ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను వివరణ కోసం మొబైల్ ఫోన్‌లో సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

హద్దేలేని సంపాదన..

ఆదిలాబాద్‌లో ఇలా వడ్డీ వ్యాపారం చేసే వారికి హద్దే లేని సంపాదన వచ్చి పడుతుండటంతో ఈ దందా రోజురోజుకూ అంతకంతకు పెరుగుతుందని జనాలు చెప్పుకుంటున్నారు. అంతే కాకుండా ఇలా ఆస్తుల పత్రాలు తనఖా పెట్టుకుని వడ్డీకి ఇచ్చిన వ్యాపారి మునిగిపోయిన దాఖలాలు ఆదిలాబాద్‌లో లేవని జోరుగా ప్రచారం ఉంది. అదే సందర్భంలో ఇలా వడ్డీకి రుణం తీసుకున్న వ్యక్తులు దాన్ని కట్టలేని పరిస్థితిలో సర్వం కోల్పోతున్నారనే నేపథ్యమే అధికంగా ఉంది. కాగా ఆదిలాబాద్‌లో వడ్డీ వ్యాపారం చేసే ఒక వ్యక్తి విలాస వంతమైన జీవితమే ఈ అడ్డగోలు సంపాదనకు నిదర్శనమనే ప్రచారం కూడా లేకపోలేదు. ఆ వ్యక్తి తరచూ ఖరీదైన వాహనాలను మార్చడం, విలాసవంతంగా జీవించడం వంటివి ఇలాంటి వాటి ద్వారానే సాధ్యమవుతుందని జనాల్లో చర్చ ఉంది. ఇది కూడా ఓ వడ్డీ వ్యాపారికి సంబంధించి ఉదాహరణ మాత్రమే. ఇలాంటి వృత్తిలో అనేక మంది ఉన్నారు.

వడ్డీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు



రామ్‌అవతార్ ఇంట్లో డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని రాంఅవతార్, సంతోష్ జైస్వాల్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లు, ప్రామిసరీ నోట్లు ప రిశీలించి స్వాధీనం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా వడ్డీ వ్యా పారం చేస్తూ అమాయకులను మోసంచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నామినేషన్లు దాఖలకు అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ఫారం–2ఏను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి 25 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారన్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్ ను ప్రతిపాదిస్తే సరిపోతుందన్నారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్ ను ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే అనుమతి పొందాలన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127–ఏ సూచనలు విధిగా పాటించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

కైలాస్‌నగర్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల ప్రచార పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అగ్నిమాపక అధికారి కేశవులు, సహాయ అధికారి గోవర్ధన్ రెడ్డి , ఎస్ఎఫ్ఓ శివాజీ, ప్రవీణ్‌కుమార్, రహీం, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బోథ్ మాజీ ఎమ్మెల్యే

- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రాథోడ్ బాపూరావు



బాపూరావుకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న సీఎం

కైలాస్‌నగర్: బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సీఎం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావించిన రాథోడ్ బాపూరావు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డిని సైతం కలిశారు. ఆ పార్టీ తరపున బోథ్ అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన ఆయన అందుకోసం దరఖాస్తు కూడా అందజేశారు. కానీ ఆయనకు కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అప్పట్లో బీజేపీలో చేరారు. ఆ పార్టీ తరపున ఎంపీ టికెట్‌ను ఆశించినప్పటికీ అది దక్కలేదు. దీంతో తీవ్ర నిరాశకు లోనైన ఆయన కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. సోమవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఆ లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు.

సీఎంను కలిసిన మున్సిపల్ వైస్ ఛైర్మన్



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జహీర్ రంజానీ

కైలాస్‌నగర్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదిలా బాద్ పట్టణంలోని ఈద్గా అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని, ముస్లిం యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించాలని కోరారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో ప్రత్యేక సభను ఏర్పాటు చేసి పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతానని ఆయన వెల్లడించారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ రాజర్షిషా



బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ, గైనిక్ వార్డు, గిరిజన వైద్య విభాగం, ఐసీయూ తదితర వార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. పేషెంట్ కేర్, స్వీపర్లు ఎంతమంది ఉన్నారని సూపర్‌వైజర్‌ను ప్రశ్నించగా 35 మంది ఉన్నారన్నారు. వారందరిని వెంటనే పిలువాలని ఆదేశించగా 25 మంది మాత్రమే వచ్చారు. మిగతా పది మంది ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించగా సూపర్‌వైజర్ ఐదుగురు సెలవులో ఉన్నారని చెప్పగా మిగతా ఐదుగురు ఎక్కడ వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణతో పాటు అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగి బంధువు ఆసుపత్రికి వచ్చే వారికి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగ్గా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్‌రెడ్డి రిమ్స్‌లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లాలో ఉపాధిహామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం డీఆర్‌డీవో సాయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ఈ జిల్లాలో 3.46 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారన్నారు. ఉపాధి పనులను చేపట్టేందుకు కూడా జిల్లా అనువుగా ఉందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం పథకం అమలులో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, అధికారుల నిర్లక్ష్యంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజు కూలి రూ.300 ఇస్తామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో రూ.100, రూ.150 కూలి కూడా గిట్టుబాటు కావడంలేదన్నారు. తాగునీరు, పారగుల్ల, గడ్డపార లాంటి సౌకర్యాలేమి కల్పించడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, వారానికోసారి పేస్లిప్ ఇవ్వాలని, కొలతతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.300 చెల్లించాలని, వేసవిభత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్ల స్వామి, నాయకులు కె.ఆశన్న, పొచ్చక్క, డి.ఆశన్న, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులకు దివ్యాంగుల అనాసక్తి

- సగం మంది కూడా పనులకు వెళ్లని వైనం
- కఠిన నిబంధనలే కారణం
- ప్రత్యేక భత్యం రద్దు

జిల్లాలో దివ్యాంగుల వివరాలు

మండలం	జాబ్‌కార్డు కలిగినవారు	పనులకు వచ్చినవారు
ఆదిలాబాద్‌రూరల్	291	122
బజార్‌హత్నూర్	125	66
బేల	290	65
భీంపూర్	151	24
బోథ్	269	90
గాదిగూడ	256	131
గుడిహత్నూర్	235	158
ఇచ్చోడ	141	31
ఇంద్రవెల్లి	109	68
జైనథ్	510	194
మావల	30	12
నార్నూర్	274	204
నేరడిగొండ	124	74
సిరికొండ	31	16
తలమడుగు	232	60
తాంసి	140	35
ఉట్నూర్	442	130



కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై దివ్యాంగులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు గతేడాది జిల్లాలో నమోదైన ఉపాధి గణంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. దివ్యాంగులకిచ్చే ప్రత్యేక భత్యాన్ని రద్దు చేయడం, ఉపాధి హామీ పనుల నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు వారికి చూపించే పనులను కూడా మార్చడంతో వచ్చేందుకు వారు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో దివ్యాంగులకు వంద రోజుల ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

నిబంధనలు కఠినతరం

ఉపాధి హామీ పథకంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని భావించిన కేంద్ర ప్రభుత్వం పనుల కల్పన, వేతనాల చెల్లింపును రాష్ట్రస్థాయి నుంచి కేంద్రానికి పరిమితం చేసింది. ఇందు కోసం గతేడాది పలు సంస్కరణలను చేపట్టింది. పనుల కల్పనకు సంబంధించిన వెబ్‌సైట్ మారిపోవడంతో దివ్యాంగులకు కల్పించే పనుల నిబంధనలను కఠినతరం చేసింది. గతంలో దివ్యాంగులు 70 శాతం పనిచేస్తే వారికి వంద శాతం కూలి చెల్లించేవారు. సకలాంగులకు ఏడాదిలో వంద రోజులు పని కల్పిస్తే దివ్యాంగులకు 150 రోజులు పని కల్పించేవారు. పైగా వారికి 5 కిలో మీటర్ల లోపు మాత్రమే పనులను చూపేవారు. ఒకవేళ అంతకంటే దూరంలో పనికి వెళ్లాల్సివస్తే 20 శాతం అలవెన్స్‌లను అదనంగా చెల్లించేవారు. పైగా వారికి నర్సరీలో మొక్కల పెంపకానికి సంబంధించిన బ్యాగులను నింపడం, ముళ్లచెట్లను తొలగించడం, చేన్లలోని రాళ్లను తీసివేయడం వంటి సులభతరమైన పనులను చేయించారు. దివ్యాంగులకు సంబంధించి పనుల ప్రగతిపై ప్రత్యేక నివేదికలను కోరేవారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది.

సగం మందే పనులకు హాజరు

ఆదిలాబాద్ జిల్లాలో 17 మండలాల పరిధిలో 468 గ్రామ పంచాయతీలుండగా 3,650 మంది దివ్యాంగులు జాబ్ కార్డులను కలిగి ఉన్నారు. ఇందులో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,490 మంది మాత్రమే పనులకు హాజరయ్యారు. ఈ లెక్కన సగం మంది కూడా పనులకు హాజరు కాలేదు. పనులకు వచ్చిన వారు గతేడాది మొత్తం 43,853 పనిదినాలను పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఉన్న వెబ్‌సైట్‌ను కేంద్రం తన పరిధిలోకి తీసుకోవడంతో దివ్యాంగులకు ఉన్నటువంటి ప్రయోజనాలన్నీ రద్దయ్యాయి. వీరు కూడా సకాలంగులతో సమానంగానే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు చూపించే పనులను కొలతల ప్రకారంగానే చేయాల్సి వస్తోంది. పనులు కఠినతరంగా ఉండటంతో పాటు వారికి కల్పించిన రాయితీలు లేకపోవడంతో దివ్యాంగులు పనులకు వచ్చేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో వారికి పని కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నేరవేరకపోగా ఇన్నాళ్లు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడ్డ వారికి నష్టం కలిగే అవకాశముంది.

నిబంధనలు మారడంతోనే..



ఉపాధిహామీ పనులకు సంబంధించి గతంలో దివ్యాంగులకు 30 శాతం వేతనాలు అదనంగా ఇచ్చేవాళ్లం. సులభమైన పనులను చూపించేవాళ్లం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మార్చడంతో దివ్యాంగులు కూడా సకాలంగులతో సమానంగా పనిచేయాల్సి వస్తోంది. పైగా గతంలో ఫీల్డ్ అసిస్టెంట్లు దివ్యాంగులను పనులకు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో వారు లేకపోవడం కూడా దివ్యాంగ కూలీలకు ఇబ్బందిగా మారింది. దివ్యాంగులు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి పనుల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి తప్పకుండా ప్రత్యేక పనులు కల్పిస్తాం.

– సాయన్న, డీఆర్‌డీవో, ఆదిలాబాద్

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల సౌకర్యార్థం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వరకు 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలకు వివిధ క్రీడల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లో బడి ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహికులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆ హ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వారు నిర్వహించాల్సిన క్రీడాంశము, ప్రదేశము, గ్రామము క్రీడా వివరాలు, సెల్‌నంబర్లతో కూడిన దరఖాస్తులను ఈ నెల 22లోగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, ఆదిలాబాద్ చిరునామాకు పంపించాలన్నారు. ఇతర సమాచారం కోసం 9440948409 /7780369672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఫార్మసిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశోక్


పురబాయి అశోక్

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జైనథ్ మండల కేంద్రానికి చెందిన పురబాయి అశోక్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గానికి అశోక్ ధన్యవాదాలు తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..!

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. మీ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని ముగ్గురు వ్యక్తులు పూజలు చేసి అర్ధరాత్రి 12 గంటల సమయంలో తవ్వకాలు ప్రారంభించారు. సుమారు ఒంటిగంట ప్రాంతంలో ఇరుగుపొరుగు వారికి శబ్దం వినిపించడంతో 100 నంబర్ కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై వి.రజనీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తవ్వకాలు జరిపిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నలుగురిని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ ఎదుట బైండోవర్ చేశారు.

నిర్మల్‌లో చైన్ స్నాచింగ్

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌కు చెందిన యమున అనే మహిళ నుంచి 2 తులాల బంగారు గొలుసును అపహరించారు. యమున బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా.. స్థానిక శివాజీచౌక్ వద్ద బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి గొలుసు లాక్కెళ్లారు. అప్రమత్తమైన యమున వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని సీఐ అనిల్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జైజవాన్‌నగర్‌కు చెందిన దమ్మపాల్‌పై అదే కాలనీకి చెందిన బ్రహ్మానంద్ దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దమ్మపాల్ అంబేడ్కర్‌చౌక్ కు వచ్చారు. ఈ క్రమంలో బ్రహ్మానంద్ దమ్మపాల్ కుమారుడిని నెట్టివేయడంతో గొడవ జరిగింది. ఇంటికి వెళ్లిన తర్వాత దమ్మపాల్‌పై దాడికి పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు

బేల: మండలంలోని బెదోడ రెవెన్యూ గ్రామ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతుండగా ఆరుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.30,540 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వడదెబ్బ.. పశు సంరక్షణ ఇలా..

- పశువైద్యాధికారి సగ్గం మహేశ్ సూచనలు





నిర్మల్‌చైన్‌గేట్: వేసవిలో మనుషులే కాదు పశువులూ వడదెబ్బకు గురవుతాయి. నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ నివారణ గురించి పశువైద్యాధికారి సగ్గం మహేశ్ రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే.. 'ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువులు షెడ్లలో ఎక్కువ సంఖ్యలో ఉండటం, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, వడగాల్పుల తాకిడికి వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి కంటె నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బబారిన పడతాయి.'

వడదెబ్బ ప్రాణాంతకమే...

వేసవి కాలంలో బయటి ఉష్ణోగ్రత పశువుల శరీర ఉష్ణోగ్రత కన్నా ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చర్మంపై గల స్వేద రంధ్రాలు చెమటను అధికంగా విడుదల చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్లను కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతాయి. శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్ హీట్ కన్నా ఎక్కువగా ఉంటుంది. చర్మ సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరుతాయి. అధిక దాహం ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 104 ఫారన్హీట్ దాటితే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్ లక్షణాలతో క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 109 డిగ్రీలు దాటితే ప్రాణపాయం సంభవిస్తుంది. వడదెబ్బ ప్రభావంతో చూలు పశువుల్లో గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంది. పశువుల్లో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది.

నివారణకు ముందస్తు చర్యలు..

వేసవిలో ముఖ్యంగా పశువులను పగటి వేళలో మేతకు వదలరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు పంపాలి. తాగునీరు అన్నివేళలా అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు కనీసం రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి. చెరువులు, కుంటల్లో ఈద నివ్వాలి. గాలి వెలుతురు ప్రసారమయ్యేలా ఎత్తయిన కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకులు ఉంటే మధ్యాహ్నం వేళల్లో వరిగడ్డి పరిచి నీరు చల్లాలి. వేసవిలో దాహంతో ఉన్న పశువులు కలుషిత నీరు తాగకుండా జాగ్రత్త వహించాలి. షెడ్డుపై వరిగడ్డివేసి మధ్యాహ్నం వేళ్లలో నీరివ్వాలి. షెడ్ల నిర్మాణం తూర్పు, పడమర దిశలలోనే జరగాలి. దీనివల్ల వడ గాల్పుల నుంచి, తూర్పు, పడమర ఎండల నుంచి రక్షణ లభిస్తుంది. పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం పాలు పితికేటప్పుడు పొదుగును చల్లని నీటిలో కడగాలి. పశువులకు గోమార్లు లేకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీరు ఎల్లవేళలో అందుబాటులో ఉంచాలి.

చికిత్స ఇలా ...

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రాంతానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి తీసుకరావడానికి పలుమార్లు కడగాలి. తాగు నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు వేయించాలి. రక్తంలోకి సైలెన్ ద్వారా గ్లూకోజు, ఎలక్ట్రోలైట్స్ అందిస్తే నీరసం నుంచి పశువులు బయటపడతాయి.

ఆరు తెగలకు ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడెం: ఎస్టీ జాబితాలోని ఆరు తెగలకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బూర్స పోచయ్య, నాయక్‌పోడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సట్ల అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నాయక్‌పోడ్, అంధ్, తోటి, ప్రధాన్, సమాజ్, తెగల నాయకులు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీలు చిన్న తెగలను పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కోతెగ నుంచి ఒక్కొక్కరిని ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు తమకు ఇకనైన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, 2.50 లక్షల జనాభా ఉన్న తెగలను కించపరిస్తే ఆ రాజకీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెబుతామని తెలిపారు. సమావేశంలో అంధ్ సమాజ్‌రాష్ట్ర అధ్యక్షుడు జల్లె పాండురంగ్, తోటి సమాజ్ నాయకుడు మెస్రం బాబురావు, ప్రధాన్ సమాజ్ నాయకుడు దుర్వ నగేశ్, వెంకటేశ్, రమేశ్, భీముడు, రాందాస్, సుధాకర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఖానాపూర్: మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకుండా అవమానించిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలోని ఎల్ఆర్.గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదిలాబాద్ పార్లమెంటుస్థాయి ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంద కృష్ణ హాజరై మాట్లాడారు. తెలంగాణలో మూడు ఎస్సీ లోక్‌సభ స్థానాలు ఉన్నప్పటికీ అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందన్నారు. సీఎం సీటు కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగల మద్దతుతో తాను ఈ స్థాయికి వచ్చానని, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే సీఎం ఇప్పుడు మాదిగలకు అవకాశాలు ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నాడన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నింటినీ భూస్థాపితం చేశామని, కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందని విమర్శించారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి మురళీకృష్ణ, నాయకులు అర్లి మల్లేశ్, బాలేరావు, నందకుమార్, గడ్డం తుకారాం, రేగుంట కేశవ్, ఆరేళ్ల మల్లేశ్, శనిగారపు రవి, కత్తి బాబు, సాయిచంద్, కాంబ్లీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి గల్ఫ్ కార్మికుల సమస్యలు


ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: దుబాయ్‌లోని హాలిడే ఇంటర్నేషనల్ హోటల్‌లో సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లోని సమస్యలతోపాటు ఎన్ఆర్ఐ పాలసీపై జీడబ్ల్యూఏసీ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చెందిన దేవేందర్‌రెడ్డి, తోట రాజ్‌కుమార్, జీవన్‌రెడ్డి, రాంకుమార్, సత్యంగౌడ్, దేవేందర్‌రెడ్డి, పవన్‌సాయి, రాపెల్లి వెంకటేశ్, మనోజ్, రవి, సత్యం, రమేష్, రాజశేఖర్, తిరుపతి, సంతోష్ తదితరులు ఉన్నారు.

గ్యారంటీలే కాంగ్రెస్ విజయానికి బాటలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి


మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: గ్యారంటీలే కాంగ్రెస్ విజయానికి బాటలు వేస్తాయని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలో పార్టీ గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా తయారైందన్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో పార్టీ ఎంపీ అభ్యర్థికి ఊహించిన దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చే అవకాశముందన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గుడిపెల్లి నగేష్, మంచికట్ల ఆశమ్మ, శ్రీ లేఖ, బండి దేవిదాస్, చారి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ఘటనాస్థలిలో సుంగు


గాయాలపాలైన శ్రీరాం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మర్కగూడకు చెందిన పెందోర్ సుంగు, కడెం మండలంలోని అల్లంపల్లికి చెందిన ఆడ శ్రీరాం సోమవారం ద్విచక్ర వాహనంపై ఉట్నూర్ నుంచి ఇంద్రవెల్లికి వస్తుండగా గుడిహత్నూర్ నుండి జైనూర్ వైపు వెళ్తున్న టిప్పర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. సుంగు పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

తాగునీటి కోసం కొలాం గిరిజనుల ఆందోళన

- ఖాళీ బిందెలతో మూడు కిలోమీటర్లు కాలినడక
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కొలాం గిరిజనులు

నార్నూర్: తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని భీంపూర్ బొజ్జుగూడ కొలాం గిరిజనులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తమ బాధలు ఎవరూ పట్టించుకోకపోవడంతో దిక్కులేని స్థితిలో మండుటెండలో దాదాపు మూడు కిలోమీటర్లు కాలినడకన ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తాకు ఫోన్లో సమస్య వివరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నీటిసమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి రూ.5 లక్షల నిధులు కేటాయించి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అధికారులు పనులు ప్రారంభించలేదన్నారు. బిందెడు నీటి కోసం పొలాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. సమస్య పరిష్కరించేంత వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకు కూర్చున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని ఎంపీడీవో జవహర్ ఫోన్లో చెప్పినా శాశ్వత పరిష్కారం కావాలన్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామస్తులు ఆత్రం సోనేరావు, సీడాం భీంరావు, కొడప భీంరావు, ఆత్రం సోంబాయి, సీడాం అనసూయ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మోతె లచ్చన (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండలం గోసపల్లి పాత ఎల్లాపూర్‌కు చెందిన మోతె లచ్చన (53) మూలికల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలో మూలికలు విక్రయించేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తుండగా మావల బైపాస్ నుంచి పట్టణంలోకి ప్రవేశించేందుకు జాతీయ రహదారి దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతునికి నలుగురు కూమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మలక్‌చించోలి గ్రామానికి చెందిన బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రూ.6 వేల విలువైన 16 లీటర్ల మద్యం పట్టుకున్నారు.

పశువుల పాక దగ్ధం

తలమడుగు: మండలంలోని అర్లి కేలో మాజీ సర్పంచ్ నారా కిష్టన్నకు చెందిన పశువుల పాక ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. పశువుల పాకలోని వ్యవసాయ సామగ్రి, పశువుల మేత, దాణా, ఇతర నిత్యావసర వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్‌వైరు తెగిపడి మూడెడ్లు మృతి


మృతిచెందిన ఎద్దులు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడడంతో మూడు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభు కు చెందిన ఎద్దులు సోమవారం ఉదయం మేతకోసం వెళ్లగా పంటపొలంలో 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడడంతో మృతి చెందాయి. ఒక్కో ఎద్దు విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. వి ద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏటా మూగజీవాలు మృతి చెందుతున్నాయని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్ ఆరోపించారు. బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

భారీగా బెల్లం, పటిక పట్టివేత


పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెంబి: మండల కేంద్రంలో ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు టన్నుల బెల్లాన్ని, టన్ను పటికను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. అక్రమంగా బెల్లం, పటిక విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ లక్ష్మణ్ తెలిపారు. గుడుంబా తయారీదారులకు బెల్లం, పటిక విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గంగారెడ్డి, అక్బరుద్దీన్, డీటీఎఫ్ సీఐ సింధూ, ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కుంటాల: కుంటాల శివారులో సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కుంటాలకు చెందిన బోనగిరి కృష్ణుడు మొక్కజొన్న పంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. రబీ సీజన్‌లో కృష్ణుడు తనకున్న ఒకటిన్నర ఎకరంలో మొక్కజొన్న సాగు చేశాడు. పంట నూర్పిడి చేసేందుకు కుప్పలుగా వేసి ఉంచాడు. మూడు రోజులుగా అకాల వర్షాల కారణంగా హార్వెస్టర్ యంత్రాలు రాలేదు. ఈ క్రమంలో ఈదురు గాలులకు సోమవారం విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు పడడంతో పంట మొత్తం కాలిపోయింది. భైంసా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రూ.1.20 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు కృష్ణుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

వలసలు ఆగేదెలా?

- బీఆర్ఎస్ నుంచి కొనసాగుతున్న జంపింగ్స్
- నేడు ఆదిలాబాద్‌కు కేటీఆర్ రాక
- పార్లమెంట్ సెగ్మెంట్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం


కేటీఆర్

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి వలసలు ఆగడం లేదు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంపింగ్స్ కొనసాగుతున్నాయి. మొన్నటి వరకు ముఖ్యనేతలు కారు మార్చగా, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నాయకుల వంతు వచ్చింది. ఈ పరిస్థితుల్లో వలసలు ఆగేదెలా అనే తర్జనభర్జన పార్టీలో సాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరగనుంది.

ఇదీ పరిస్థితి..

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ క్రమంగా ఢీలా పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పార్టీ నుంచి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ముఖ్యనేతలు మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్ రెడ్డి ఇది వరకే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి ఐకేరెడ్డి కూడా చేరుతారనే ప్రచారం ఉంది. ఇదిలా ఉంటే తాజాగా నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలోనే వారు హస్తం గూటికి చేరనున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న ప్రచారం ఉంది. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లోకి ఇది వరకే పార్టీ మారారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో పార్టీ బలహీన పడింది. పార్లమెంట్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పార్టీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. బూత్ స్థాయిలో కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు కేటీఆర్ పర్యటన తోడ్పడుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

ఆ ఇద్దరూ కదిలారు...

సాక్షి ఎఫెక్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో అక్రమ డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న ఇద్దరు ఉపాధ్యాయుల తీరును తెలియజేస్తూ ఈ నెల 9న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ ఇద్దరూ కదలట్లే... డిప్యూటేషన్ రద్దు చేసిన పాత చోటే విధులు శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. ఆ ఉపాధ్యాయులపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి ఆ ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నట్లు నిర్ధారించారు. వెంటనే వారు పనిచేసే పోస్టుల్లో చేరాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అంకోలి ఎస్జీటీ ఉపాధ్యాయుడు కబీర్‌దాస్, ఉట్నూర్ ఉర్దూ మీడియా పాఠశాల పీఈటీ జయశ్రీ వారివారి స్థానాల్లో విధుల్లో చేరారు.

దేహగామలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని దేహగామలో సోమవారం యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌కోండ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి త్రియంబక్‌రావు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.7 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రియంబక్‌రావు, సంజీవరెడ్డి, గ్రామ పెద్దలు పాటీల్ ఆడనాగోరావు, పెందూరు కృష్ణ మహాజన్, ఆత్రం గణపతి రావు, ధ్రువ సూర్యభాన్, గాట్యాల్, నైతం మారుతి, యూత్ అధ్యక్షులు యూత్ సభ్యులు భీమ్రావు అనిల్ రవి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.